క్లుప్తంగా

అంగన్‌వాడీ సేవలపై దృష్టి సారించండి



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్ వైజర్లు

ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే సేవలు సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ మద్దమ్మతో పాటు పలువురు సూపర్‌వైజర్లు బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా నియామకమైన సూపర్‌వైజర్లను సీడీపీఓ ఎమ్మెల్యేకు పరిచయం చేయించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

గ్రంథాలయ అధికారిగా రాంకుమార్



పత్తికొండ రూరల్: పత్తికొండ శాఖ గ్రంథాలయ అధికారిగా రాంకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తుగ్గలి లైబ్రేరియన్‌గా పనిచేస్తూ ఇటీవలే పదవీ విరమణ పొందారు. అయితే ప్రభుత్వం పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడంతో రాంకుమార్ తిరిగి విధుల్లోకి చేరారు. వారంలో 5 రోజులు, తుగ్గలిలో ఒక రోజు విధుల్లో కొనసాగేలా అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా దేవర



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని ఆర్.మండగిరిలో గ్రామ దేవర మహోత్సవాన్ని గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత సుంకులమ్మవ్వకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దేవర ఉత్సవాల్లో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పోలీసు బందోబస్తు చేపట్టారు.

18 నుంచి ఉరుసు

తుగ్గలి: ఈనెల 18 నుంచి నల్లగుండ్లలో మునిస్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు బుధవారం గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18న గంధం, 19న ఉరుసు, 20న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉరుసు సందర్భంగా కబడ్డీ, వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 89195 88669, 63003 93085 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను తొలగించేందుకు జగనన్న భూ హక్కు– భూ రక్ష పథకం ద్వారా రీసర్వే చేపట్టిందని డిప్యూటీ తహసీల్దార్ రఘువీర పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మిట్టసోమపురం గ్రామంలో రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మిట్టసోమపురం, ఇబ్రహీంపురం, పూలచింత, మాచాపురం గ్రామాల్లో సమగ్ర భూ సర్వే పూర్తయ్యిందన్నారు. రైతులకు సంబంధించిన భూ హక్కు పత్రాలు (టైటిల్ డీడ్) ఆయా గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు తీసుకోవాలని కోరారు. వీఆర్వోలు రాఘవేంద్ర, కొండన్న, బి.రాఘవేంద్ర, గ్రామ సర్వేయర్లు తేజశ్విని, శేఖర్, ఆరోణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలు

పత్తికొండటౌన్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని పత్తికొండ సీహెచ్‌సీ డాక్టర్ వై.విజయభాస్కర్, డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. డాక్టర్లతో పాటు కమిటీ సభ్యులు భాస్కర్ నాయక్, లక్ష్మన్న, హసీనాభాను, సిబ్బంది సమావేశమై ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. డాక్టర్లు మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి బుధ, గురువారాల్లో ఆదోని ఆస్పత్రి నుంచి చిన్న పిల్లల డాక్టర్, గైనకాలజీ డాక్టర్ పత్తికొండ ఆస్పత్రికి వచ్చి రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. త్వరలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, వైద్య సేవలు అన్నీ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తొగర్చేడు గ్రామంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. కృష్ణగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్రంలోని అవ్వా, తాత, వికలాంగులు, వితంతువుల, ఒంటరి మహిళల కళ్లలో ఆనందం నింపడమే ధ్యేయంగా కృషి చేస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. పేదవారి అభివృద్ధి కోసం జగనన్న కృషి చేస్తుంటే, చంద్రబాబు అవినీతి, బినామీల కోసం పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో అవినీతితో సంపాదించిన డబ్బు పంచేందుకు చంద్రబాబు నాయుడు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్, ఎల్లో మీడియా ఏకమయ్యారని, వీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. సీఎం జగనన్న పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని వివరించారు. గతంలో పింఛను లబ్ధిదారుడు మరణిస్తేనే ఇంకొకరికి అవకాశం వచ్చేదని, ప్రస్తుతం అర్హులందరికీ పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. మండలంలో 4,908 మందికి పింఛన్ ఇస్తుండగా కొత్తగా 189 మందికి పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. కొత్తగా మంజూరైన పింఛన్లలో టీడీపీకి చెందిన వారికే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, మండల కో–ఆప్షన్ మెంబర్ నక్కషాలు, ఎంపీటీసీ సభ్యురాలు అంకాల మహాలక్ష్మి, సూపరింటెండెంట్ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



మంత్రి గుమ్మనూరు జయరాంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్

ఆలూరు: కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారి సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక మంత్రి నివాసంలో బుధవారం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సురేష్‌బాబు, సహాయ అధికారులు కనకలక్ష్మి, వెంకటరాముడు, కేశన్న తదితరులు మంత్రిని మర్యాదపూర్వకగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. బాల కార్మిక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గౌండ, కట్టు, తాపీ మేస్త్రీలు, టైలర్లు, పెయింటర్లు, తదితర కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆదోని, పత్తికొండ రెవెన్యూ డివిజన్లకు చెందిన రెవెన్యూ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్‌ఈఈ, డీలు, ఎంపీడీఓ, తహసీల్దార్లు, వ్యవసాయశాఖ ఏడీఏలు,విద్యుత్‌శాఖ ఈఈ, డీఈఈ, హెచ్ ఎలెల్సీ, ఎల్‌ఎల్‌ల్సీ, తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు మంత్రిని కలిశారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు.

పొదుపు మహిళల జీవనోపాధి పెరగాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగశివలీల

ఎమ్మిగనూరు: మహిళా సాధికారిత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, పొదుపు మహిళల జీవనోపాధులు పెరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఆదోని, ఎమ్మిగనూరు పురపాలక సంఘాలకు చెందిన పొదుపు సంఘాల ఆర్పీలు, మెప్మా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళల ఆర్థిక పరిపక్వతను పెంచేందుకు ఉద్దేశించిన మహిళా మార్టలను ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు విరివిగా బ్యాంకు రుణాలు ఇప్పించి వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల పరిధిలో అమలైన సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఏఓలు నాగరాజు, ఐబి మురళి, ఎల్‌హెచ్ జిలానీబాషా, టీఎంసీ వెంకటేశ్వర్లు, సీఓలు, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



హొళగుంద జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

హొళగుంద: జీవితంలో ఎదిగేందుకు 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. బుధవారం హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన, మాట మంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ధైర్యాన్ని నూరిపోస్తూ వారికి చదువుపై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను చదివించాలని ఆ దిశగా టీచర్లు ప్రణాళికతో ముందకెళ్లాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు, ఇతర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీచర్ల కొరత, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎస్‌ఎస్‌ఏ పీఓ వేణుగోపాల్, ఆదోని డీఎల్ డీఈఓ సుకుమార్, ఎంఈఓ ఈరన్న, హెచ్‌ఎంలు మల్లికార్జునగౌడ్, రంగన్న, కబీర్‌సాబ్, టీచర్లు పాల్గొన్నారు.

టీచర్లను నియమించాలి

హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు, మండల సహాయ కార్యదర్శి నిత్య, ఉపాధ్యక్షుడు గణేష్‌లు బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

నందవరం: పదో పరీక్షల్లో ఉతీర్ణత శాతం పెంచి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించే సామర్థ్యాల పెంపు పరీక్షను ఎంఈఓ పరిశీలించారు. అలాగే నాడు–నేడు అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఉపకరణాల పంపిణీ

మద్దికెర: లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా స్థానిక మెయిన్ ఎంపీపీ పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మంజూరైన వీల్‌చైర్స్, వినికిడి, స్టాండింగ్ ఉపకరణాలు ఎంఈఓ రంగస్వామి బుధవారం అందజేశారు. హెచ్‌ఎం విశ్వనాథ్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విపత్తు రక్షణ చర్యలపై అవగాహన



డెమో ప్రదర్శిస్తున్న ఫైర్ ఎస్‌ఐ రామాంజనేయులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం జాతీయ విపత్తు కమిటీ చైర్మన్ ప్రిన్సిపాల్ సాగరిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జయన్న, రూరల్ సీఐ మంజునాథ్, అగ్నిమాపక అధికారి రామాంజనేయులు హాజరయ్యారు. అగ్నిమాపక అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ అపార్ట్‌మెంట్స్, ఇతరచోట్ల ప్రమాదాలు, వరదలు వచ్చినప్పుడు అప్రమత్తతతో ఎదుర్కొని బయట పడవచ్చునని చెప్పారు. రూరల్ సీఐ మంజునాథ్ మాట్లాడుతూ భౌతికంగా సంభవించే విపత్తుల సమయాల్లో ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చునని, సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే ప్రమాదాన్ని వివేకంతో ఎదుర్కోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని చెప్పారు. అనంతరం అగ్నిమాపక పోలీసుల ఆధ్వర్యంలో విపత్తు సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, అప్రమత్తతపై డెమో ప్రదర్శించారు. విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యత పరీక్షిస్తున్న అధికారులు

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తి గ్రామం నుంచి రామదుర్గం వరకు 7.6 కి.మీ మేర రూ.11.40 కోట్లతో నిర్మించిన రోడ్డు నాణ్యతను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించారు. ఎస్‌ఈ శివకుమార్, డీఈ వెంకటేశ్వర రెడ్డి, ఈఈ గీతావాణి తదితరులు ఉన్నారు.

డ్రాపవుట్లు ఉండరాదు

హొళగుంద: వివిధ కారణాలతో విద్యార్థుల చదువు మధ్యలో ఆగకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోందని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఎస్‌ఎస్‌ఏ పీఓ) వేణుగోపాల్ అన్నారు. బుధ వారం ఆయన హొళగుందలోని కట్లమాగి పాఠశాల భవనంలో కొనసాగుతున్న సీజనల్ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పీఓ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఇతర ప్రాంతాల కు వలస వెళితే వారి పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జిల్లాలో 71 సీజనల్ హాస్టళ్లను ప్రారంభించి విద్యార్థులకు వసతి, నాణ్యమైన భోజనం, విద్య అందిస్తున్నామన్నారు. ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నహ్యాట నాగరాజు, పాఠశాల అధికారి శ్రీనివాసులు, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నందవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్‌ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్‌ఐ మహేష్ కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సాహించి విద్యాభివృద్ధికి పాటుపడాలని వారికి పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: విద్యార్థి సంఘాల నాయకులు విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేసి సాధించుకోవాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్‌ఎఫ్–2023 నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు రంగస్వామి, మునిస్వామి, హర్ష తదితరులు ఎస్‌ఐ తిమ్మారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

పాఠశాల తనిఖీ

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరి జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఎంఈఓ ఇందిర తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, నాడు–నేడు పనులు, ఎస్‌ఏ–1 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను వినియోగించుకుంటున్న తీరుపై చర్చించారు. 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలి



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్ రమేష్

ఎమ్మిగనూరుటౌన్: క్రీడాకారులు గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో ప్రతిభను చాటుకోవాలని స్థానిక 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్ రమేష్ పేర్కొన్నారు. పట్టణంలో నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు గత 34 రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన పోటీల్లో స్థానిక హైటెక్ లెవెన్ జట్టుపై ఎఫ్‌ఎం హాస్పిటల్ లెవెన్ జట్టు గెలుపొందింది. ఈ జట్టులో ప్రతిభ చాటిన క్రీడాకారుడు పవర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రెండవ మ్యాచ్‌లో స్థానిక యంగ్ సహరా లెవెన్ జట్టుపై డేంజరస్ లెవెన్ జట్టు గెలుపొందింది. ఈ జట్టులో జయ అనే క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, కౌన్సిలర్ అమాన్ అందజేశారు. టోర్నీ నిర్వాహకులు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, సయ్యద్‌చాంద్, వడ్డె రంగన్న, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీకి ఘన నివాళి



పత్తికొండ భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: అంధుల విద్యావేత్త లూయిస్ బ్రెయిలీ జయంతి పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటానికి ఎంఈఓ అంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక వికలాంగుల సంక్షేమ కమిటీ కార్యాలయంలో బ్రెయిలీ చిత్రపటానికి మల్లెల గ్రూప్ అధినేత డాక్టర్ ఆల్‌ఫ్రెడ్‌రాజు, వీహెచ్‌పీఎస్ నాయకులు నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు.

పత్తికొండటౌన్: పట్టణంలోని భవిత కేంద్రంలో సహిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, చిన్నారులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు..

నేడు గోనెగండ్లకు ఎమ్మెల్యే రాక

గోనెగండ్ల: మండల కేంద్రంలో గురువారం చేపట్టనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 330 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని, వీరికి గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే చేతులమీదుగా పింఛన్లు అందించనున్నట్లు వెల్లడించారు.

ఉపాధి పనులు కల్పించండి

ఎమ్మిగనూరుటౌన్: గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మన్న కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ. ఉపాధి కోసం గ్రామాల నుంచి ప్రజలు వలస వెళుతున్నారని, కూలీలకు స్థానికంగా ఉపాధి పనులు కల్పించాలని కోరారు. జాబ్‌కార్డులు, పనిముట్లు ఇవ్వాలన్నారు. ఆ సంఘ నాయకులు ఏసేపు, నరసింహులు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అరికెర బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నారాయణ స్వామి

ఆలూరు/ఆస్పరి: అట్టడుగు వర్గాల వారు ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సుంకర ఉమాదేవి ఆధ్వర్యంలో మండలంలోని తొగలగల్లు, శంకరబండ గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా 66 మందికి భూహక్కు పత్రాలు, అలాగే 292 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. పత్తికొండ ఆర్డీఓ ఎం.మోహన్‌దాస్, మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు. నారాయణస్వామి మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అధించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆస్పరి సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్, తహసీల్దార్ కుమార్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ఆలూరు మండలంలోని అరికెర గ్రామ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలలో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, గురుకులంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ప్రవేశపెట్టేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరగా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ శ్రీరాములు, అరికెర సర్పంచ్ నాగరాజు,మండల కన్వీనర్ వీరేష్, కో–కన్వీనర్ హనుమయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ వివాదాలకు చెక్



లింగనేనిదొడ్డిలో రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ రవి

తుగ్గలి: భావితరాలకు భూ వివాదాల సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వే చేపట్టిందని తహసీల్దార్ రవి అన్నారు. బుధవారం లింగనేనిదొడ్డిలో శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా 234 మంది రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర సర్వే చేపట్టామన్నారు. భూముల పరిరక్షణ, సివిల్ తగాదాల నివారణ, భూమి అమ్మకాలు కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించడం, రెవెన్యూ ప్రక్షాళనకు, ప్రతి అంగుళం భూమికి క్లియర్ టైటిల్ ఇచ్చేందుకు ఈ సర్వే ఉపయోగ పడుతుందన్నారు. సర్వేకు రైతులంతా సహకరించాలని కోరారు. సర్వే డీటీ వసుంధర, ఆర్‌ఐ సుధాకరరెడ్డి, మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వో రాజుకుమార్‌నాయక్ పాల్గొన్నారు.

నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



వలంటీర్లతో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవతర్నాల సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ సూచించారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు మండల పరిధిలోని గుడేకల్ గ్రామ సచివాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు తమకు కేటాయించిన గృహాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సంక్షేమ ప్రభుత్వ కొనసాగేందుకు మరోసారి సీఎంగా వైఎస్ జగనన్నను గెలిపించుకునేందుకు మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ మాల నరసమ్మ, ఎంపీటీసీలు అయ్యప్ప, రాజు, వలంటీర్లు, పాల్గొన్నారు.

మురి'పింఛన్'



చెన్నంపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లలితమ్మ



పుల్లగుమ్మిలో పింఛన్ అందిస్తున్న నాయకులు



హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారమ్మకు పింఛను అందిస్తున్న వీరాంజనేయులు



కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లోక్‌నాథ్‌రెడ్డికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఖాదర్

తుగ్గలి: మండలంలోని చెన్నంపల్లి, తుగ్గలి, ఉప్పర్లపల్లి, జొన్నగిరి గ్రామాల్లో బుధవారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ పింఛను కానుకను లబ్ధిదారులకు అందజేశారు. పెంఛను సొమ్ము రూ.250 పెంచి రూ.2750 చొప్పున అందించడంతో లబ్ధిదారుల్లో సంతోషం నెలకొంది. వైఎస్ ఎంపీపీ నాగప్ప, సర్పంచ్‌లు ప్రభాకరరెడ్డి, ఓబులేసు, రామాంజినేయులు, ఎంపీటీసీ సభ్యులు లలితమ్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

96.77 శాతం పింఛన్ల పంపిణీ

తుగ్గలి: వైఎస్సార్ పింఛను కానుకలో భాగంగా మండలంలో బుధవారం నాటికి 96.77 శాతం మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. మొత్తం 7,722 మందికిగాను 7,479 మందికి నగదు అందజేశామని, 7వ తేదీలోపు వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని ఎంపీడీఓ ఎస్‌ఎం బాషా తెలిపారు.

కొనసాగుతున్న కొత్త పింఛన్ల పంపిణీ

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ

పత్తికొండ రూరల్: పెద్దహుల్తి గ్రామానికి చెందిన కారుమంచి కారమ్మ అనారోగ్యంతో హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ఉప్పర వీరాంజనేయులు హైదరాబాదుకు వెళ్లి పింఛన్ రూ.2,750 అందజేసి కృతజ్ఞతలు పొందాడు.

మద్దికెర: పెరవలి గ్రామానికి చెందిన లోక్‌నాథ్‌రెడ్డి అనారోగ్యంతో కర్నూలులోని మెడికవర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఖాదర్ అక్కడికే వెళ్లి పింఛను అందజేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాడు.

కొత్త పింఛన్ల పంపిణీ

వెల్దుర్తి: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ పండుగలా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, వలంటీర్లకు తోడుగా వెళ్లి కొత్త పింఛన్లను ఆనందంగా అందిస్తున్నారు. పుల్లగుమ్మి గ్రామంలో మంజూరైన కొత్త పింఛన్లను బుధవారం గ్రామ నాయకులు వెంకటేశ్వర్లు, అచ్యుతానందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలతోపాటు సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించారు. రామళ్లకోటలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి మాధవస్వామి, సచివాలయ కన్వీనర్ బీటీ నాయుడు నూతన పింఛన్లను పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

హాలహర్వి: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రవతి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రంలో రికార్డులు, ఎంత మంది పిల్లలు, ఉన్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే పౌష్టికాహార కిట్లు సక్రమంగా అందించాలన్నారు. పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.